సాక్షి
పార్వతీపురం మన్యం
శనివారం । 3 । ఆగస్టు । 2024



జనం ఉన్నా.. సౌకర్యాలు సున్నా
రైళ్లలో జనరల్ బోగీలు నరకానికి నకళ్లుగా మారాయి. కిక్కిరిసి న బోగీల్లో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. - 8లో



హిట్ అండ్ రన్ బాధితులకు ఆర్థిక భరోసా - 8లో
హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు డీఆర్వో జి.కేశవనాయుడు తెలిపారు.



లాడ్జిలో పట్టుబడిన 4 కిలోల బంగారం - 8లో
పన్నులు ఎగ్గొడుతూ పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలను తరలిస్తున్న ముఠాను బొబ్బిలి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.

న్యూస్‌రీల్

ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ఆహ్వానం

- మాజీ డిప్యూటీ సీఎంను కలిసిన గిరిజన సంఘాలు



మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను ఆహ్వానిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

సాలూరు: పాచిపెంట మండలంలో పారమ్మ కొండ వద్ద గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను ఆదివాసీ వికాసపరిషత్ నాయకులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో రాజన్నదొరను కలిశారు. తనకు అందిన ఆహ్వానంపై రాజన్నదొర సుముఖత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గిరిజనుల సమస్యలు తదితర అంశాలపై రాజన్నదొర, గిరిజన సంఘాల నాయకులు కాసేపు చర్చించారు. కార్యక్రమంలో ఆదివాసీ వికాస పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరప్పదొర శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.సింహాచలం, మండల అధ్యక్షుడు ఎర్రజన్ని తమ్మయ్య, అధ్యక్షుడు చింత సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

పార్వతీపురం: పింఛన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు సస్పెన్షన్ విధిస్తూ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పింఛన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో ఆరోపణలు వాస్తవమని రుజువు కావడంతో పాచిపెంట మండలం కేసలి పంచాయతీ గ్రేడ్-4 కార్యదర్శి సేనాపతి సునీత, గ్రేడ్-5 గ్రామ కార్యదర్శి కోలక వాసులను సస్పెన్షన్ చేశారు. రెండు సంవత్సరాల క్రితం మరణించిన వ్యక్తి పేర పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు విచారణలో తేలడంతో సస్పెన్షన్‌కు గురయ్యారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఎస్పీ వకుల్‌జిందాల్




జిల్లా పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్‌డే నిర్వహించారు. వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. వచ్చిన విన్నపాల్లో పోలీస్ సిబ్బంది బదిలీలు, ప్రమోషన్లు, ఆరోగ్యపరమైన సమస్యలు, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు నిలిపివేయాలని కోరుతూ వచ్చినవే ప్రధానంగా ఉన్నాయని ఎస్పీ తెలిపారు.

మాకొద్దు బాబోయ్.!

కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్లయింది కూటమి నేతల వ్యవహారం. అధికారంలో ఉన్నప్పుడే దర్పం చూపించాలనే ధోరణికి వచ్చిన నేతలు తహసీల్దార్ల బదిలీల వ్యవహారంలో రాజకీయం చేస్తున్నారు. కీలక స్థానాల్లో తమ వారిని కాదని..మరొకరిని నియమించడాన్ని ఆక్షేపిస్తూ..ఏకంగా బదిలీల ఉత్తర్వులనే పట్టుబట్టి మరీ మార్పు చేయించారు.

- తహసీల్దార్ల బదిలీల్లో మార్పులు
- రాజకీయ ఒత్తిళ్లే కారణమా?



సాక్షి, పార్వతీపురం మన్యం:

తహసీల్దార్ల బదిలీల్లో కూటమి నేతలు తమ 'మార్క్' చూపించుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పని చేశారన్న చిన్న అపనమ్మకం వస్తే చాలు..మరోచోటకు బదిలీ చేయించారు. ఇదే సమయంలో తమకు అనుకూలంగా పని చేసే వారిని నియమించుకునేందుకు సిఫారసులకు ప్రాధాన్యమిచ్చారు. నాలుగు రోజుల క్రితం జిల్లాలోని 20 మంది తహసీల్దార్లకు పోస్టింగులిస్తూ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా మండలాలకు తహసీల్దార్లు వెళ్లేందుకు సిద్ధపడుతుండగా..అధికారుల నుంచి ఊహించని షాక్ వారికి ఎదురైంది. మళ్లీ కొత్తగా ఉత్తర్వులు ఇస్తామని..అప్పటి వరకూ ఎవరూ విధుల్లో చేరవద్దని ఆదేశాలు వెళ్లినట్లు సమాచారం. దీంతో కంగుతినడం ఆయా తహసీల్దార్ల వంతైంది.

'కూటమి' నేతలు పట్టుబట్టారా?

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు గత ఎన్నికలకు ముందు జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు తహసీల్దార్లు బదిలీపై విశాఖపట్నం, శ్రీకాకుళం తదితర జిల్లాలకు వెళ్లిన విషయం విదితమే. ఆయా జిల్లాల్లో పని చేస్తున్న వారు పార్వతీపురం మన్యం జిల్లాలో ఎన్నికల సమయంలో పని చేశారు. ఎన్నికలు ముగిసి, ఫలితాలు వెలువడి, కొత్త ప్రభుత్వం కొలువు దీరినా మొన్నటి వరకూ వారిని యథాస్థానాలకు పంపలేదు. ఇటీవలే ఎవరి జిల్లాలకు వారిని బదిలీ చేయాలని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంబంధిత తహసీల్దార్ సొంత డివిజన్‌లో కాకుండా మరో డివిజన్‌కు వారిని కేటాయించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు జిల్లాకు వచ్చిన 20 మంది తహసీల్దార్లను 15 మండలాలకు, ఆర్డీవో కార్యాలయాల్లోనూ, కలెక్టరేట్‌లోని సెక్షన్లకు కేటాయిస్తూ నాలుగు రోజుల క్రితం కలెక్టర్ ఎం.శ్యామ్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అనేక కసరత్తుల తర్వాత వారికి పోస్టింగులిచ్చారు. ఈ జాబితాను తీరిగ్గా చూసుకున్న పలువురు 'కూటమి' పెద్దలు..కొంతమంది తహసీల్దార్లను తమ మండలంలో చేర్చుకోవడానికి అంగీకరించనట్లు తెలుస్తోంది. ఇదే విషయమై కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు స్పష్టం చేసినట్లు సమాచారం. వెంటనే జిల్లా అధికారుల నుంచి జాబితాలో కొన్ని మార్పులు ఉన్నాయని..అంతవరకూ ఎవరూ విధుల్లో చేరవద్దని తహసీల్దార్లకు ఆదేశాలు వెళ్లాయి. మార్పులు, చేర్పులతో శుక్రవారం మరో జాబితాను విడుదల చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం పార్వతీపురం తహసీల్దారుగా పి.సోమేశ్వరరావు, సీతానగరం తహసీల్దార్‌గా జె.రాములమ్మ, బలిజిపేటకు జీవీ జనార్దన్, భామిని మండలానికి ఆర్.ఉమామహేశ్వరరావు, సీతంపేటకు పి.అప్పలరాజు, సాలూరు మండలానికి ఎన్వీ రమణ, పాచిపెంటకు డి.రవి, కురుపాం తహసీల్దార్‌గా ఎం.రమణమ్మ, పాలకొండ మండలానికి ఆర్.బాలమురళీకృష్ణ, కొమరాడ తహసీల్దార్‌గా ఆర్.రమేష్‌కుమార్, గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్‌గా ఎస్.అప్పారావు, జియ్యమ్మవలస మండలానికి డీవీ సీతారామయ్యలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో కొంతమంది ఇష్టంగా ఆయా స్థానాలకు వెళ్తుండగా..మరికొంత మంది రాజకీయ క్రీడలో తాము బలైపోయామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆటలు ఆడుకుంటున్న విద్యార్థులు



చతికిలబడిన చదువు

- గిరిజన మంత్రి ఇలాకాలో..
- ఇంకా తెరుచుకోని నాలుగు జీపీ స్కూల్స్

సాలూరు రూరల్:

గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సొంత నియోజకవర్గంలో గిరిజన విద్యార్థుల భవితవ్యం గాలికి కొట్టుకుపోయేలా కనిపిస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభమై సగం కాలం గడిచిపోతున్నా సాలూరు మండలంలో ఇంతవరకు 4 గిరిజన ప్రైమరీ స్కూల్స్ తెరుచుకోలేదు. స్వయాన మంత్రి నియోజకవర్గంలో ఇంతవరకు పాఠశాలలు తెరుచుకోకపోవడంపై గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి. మండలంలో 13 జీపీ పాఠశాలలు ఉండగా వాటిలో 9 పాఠశాలలకు సీఆర్‌టీలను నియమించారు. మిగిలిన నాలుగు పాఠశాలలకు సీఆర్‌టీలను నియమించలేదు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గిరిజన శాఖ మంత్రి నియోజక వర్గంలోనే గిరిజన విద్యార్థుల అభ్యాసానికి ఉపాధ్యాయులను నియమించకుండా గాలికి వదిలేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తోణాం పంచాయతీ పరిధిలోని నిమ్మలపాడు, బందపాయి, పనసవలస, రామస్వామివలస గ్రామాలలో జీపీఎస్‌లకు ఉపాధ్యాయులను నియమించకపోవడంతో దాదాపు 40 మంది గిరిజన విద్యార్థుల భవిష్యత్‌ను ఈ ప్రభుత్వం ఏం చేయాలనుకుంటోందో సమాధానం చెప్పాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా నిమ్మలపాడు పాఠశాలను చిన్నపాకలో కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వం నాడు నేడు కార్యక్రమంలో భాగంగా ఏజెన్సీలోని పలు పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచింది. ఇంకా మిగిలిన ఉన్న పాఠశాలలపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని గిరిజన సంఘాల నాయకులు, నియోజకవర్గ ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.



చిన్నపాకలో నిర్వహిస్తున్న నిమ్మలపాడు పాఠశాల

ప్రజలకు సంతృప్తికరంగా సేవలు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రజలు సంతృప్తి పేడ విధంగా తహసీల్దార్‌లు సేవలు అందించి రెవెన్యూ వ్యవస్థకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శుక్రవారం తహశీల్దార్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. రెవెన్యూ అంశాల పట్ల సానుకూలంగా స్పందించి మంచి పరిష్కారం చూపించాలని స్పష్టం చేశారు. రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు మండల స్థాయిలో పరిష్కారం కావాల్సిందేనని స్పష్టం చేశారు. ముఖ్యంగా భూసమస్యల పట్ల క్షుణ్ణంగా విచారణ చేయాలని ఆదేశించారు. మండలాల్లో సంభవించే విపత్తులు, ఇతర సమస్యలను ముందుగా గుర్తించే విధంగా వ్యవహరించాలని చెప్పారు. గ్రామస్థాయి సమాచారం పక్కాగా కలిగి ఉండాలని ఆదేశించారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్, భూ సేకరణ, గృహనిర్మాణం, తదితర అంశాలపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పారిశ్రామిక తదితర అవసరాలకు జిల్లాలో ల్యాండ్ బ్యాంక్ అవసరమని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక, ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, పార్వతీపురం ఆర్‌డీఓ కె.హేమలత, పాలకొండ ఆర్‌డీఓ వీవీ.రమణ, కలెక్టరేట్‌లోని పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నిత్యావసర వస్తువుల ధరల స్థిరీకరణ

పార్వతీపురం: జిల్లాలో నిత్యావసర వస్తువుల ధరలను స్థిరీకరించడానికి మార్కెట్‌లో సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో స్పెషల్ కౌంటర్లు ప్రారంభించామని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కౌంటర్లలో నాణ్యత కలిగిన కంది పప్పు, బియ్యం ధరలను మరింత తగ్గించి విక్రయించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంద ని పేర్కొన్నారు. ఈ కేంద్రాల్లో కందిపప్పు (దేశవాళీ రకం) కిలో రూ.160 నుంచి 150, బియ్యం (ఫైన్ స్టీమ్) కిలో రూ.49 నుంచి రూ. 48, ఫైన్ ముడి (రా) బియ్యం కిలో రూ.48 నుంచి రూ.47కు తగ్గించేలా నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. రైతు బజార్లు, ఇతర షాపులలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అనుమతులు లేకుండా

ఆశ్రమం నిర్వహణ

- పిల్లల భవితతో చెలగాటం
- మండిపడిన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు
- అనుమతులు లేకుండా ఎలా నిర్వహిస్తారంటూ నిలదీత

గంట్యాడ: మండలంలోని కరకవలస గ్రామంలో ప్రేమ వెలుగు సేవా ఆశ్రమ సంస్థలో ఆశ్రయం పొందుతున్న 21 మంది విద్యార్థులు బిర్యానితిని వాంతులు, విరేచనాలతో అవస్థతకు గురై ఎస్.కోట ఏరియా ఆస్పత్రి, కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. సంస్థను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ అనుమతులు ఇచ్చేందుకు 2019లోనే నిరాకరిస్తే సంస్థను ఎలా నిర్వహిస్తారని నిర్వాహకురాలు భవిరిశెట్టి వెలుగుమణిని ప్రశ్నించారు. ఆశ్రమంలో విద్యార్థులకు కనీస వసతులు లేక పోవడంతో మండిపడ్డారు. పిల్లలకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పాడైన గచ్చులు, ఒకే మరుగుదొడ్డి, ఫ్యాన్లు లేకపోవడం, ఆశ్రమం ఆవరణ అధ్వానంగా ఉండడంపై అసహనం వ్యక్తంచేశారు. ఆశ్రమ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఆ తర్వాత ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 19 మంది పిల్లలను ఆయన పరామర్శించారు. ఆశ్రమంలో ఉన్న ఎస్.కోట మండలానికి చెందిన 22 మంది, అరకు మండలానికి చెందిన 17 మంది, అనంతగిరి మండలానికి చెందిన ముగ్గురు, పాచిపెంట మండలానికి చెందిన ఇద్దరు, మారికవలసకు చెందిన ఇద్దరికి మంచి హాస్టల్‌లో చేర్పించి ఉత్తమ విద్య అందేలా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఈఓ ప్రేమ్‌కుమార్, జిల్లా బాలల సంక్షేమ కమిటీ అధ్యక్షుడు జి.హిమబిందు ఇన్‌చార్జి డీసీపీయూ యాళ్ల నాగరాజు, ఎంఈఓలు విజయకుమారి, వెంకటరావు, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, చైల్డ్ లైన్ ప్రతినిధి చప్ప అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



ప్రేమ, వెలుగు సేవా ఆశ్రమ సంస్థలో నిర్వాహకులను విచారిస్తున్న అప్పారావు, తదితరులు



ప్రేమ వెలుగు సేవా ఆశ్రమ సంస్థ

- సీతంపేట ఏజెన్సీలో భారీగా దిగుబడి
- పట్టణ ప్రాంతాల్లో కిలో రూ.140 పైనే ధర
- ఏజెన్సీలో కిలో రూ.110కి గిరిజనుల విక్రయం
- రూ.30 వ్యత్యాసంతో కొనుగోలు చేస్తున్న దళారీలు
- 15 వేల ఎకరాల్లో పండిన పంట
- అల్లం తవ్వే పనిలో నిమగ్నమైన గిరిజనులు

రంగంవలసలో అల్లం ఆరబెడుతున్న గిరిజనులు



అల్లం ధరకు గొళ్లెం

సీతంపేట:

అల్లం లేని కూర వంటకం లేదు. కొద్ది రోజుల కిందట కిలో రూ.200 ధర పలికిన సందర్భం ఉంది. ఇప్పుడు మన్యంలో ఈ పంట విస్తారంగా పండుతోంది. ఇప్పుడిప్పుడే భారీగా దిగుబడులు వస్తున్నాయి. ఇదే తడవుగా అల్లం ధరలకు వ్యాపారులు కళ్లెం వేశారు. సీతంపేట మండలంలోని రంగంవలస, ఎగువద్వారబందం, దిగువద్వారబందం, పుట్టిగాం, తుంబలిగూడ తదితర ప్రాంతా ల్లో పంట చేతికొచ్చింది. కొండ పోడులో దాదాపు 15 వేల ఎకరాల్లో గిరిజనులు పండిస్తున్నారు. ఎకరాకు 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పెద్దగా తెగుళ్లు లేకుండా అంతగా పెట్టుబడులు అవసరం లేకుండా పండే పంటల్లో ప్రధానమైన పంట ఇది. ఇప్పుడిప్పుడు సీతంపేట ఏజెన్సీలో గిరిజనులు ఈ పంటను సాగు చేస్తున్నారు. గతంలో వందల ఎకరాల్లో పండే అల్లం పంట, ఇప్పుడు వేల ఎకరాల్లో పండిస్తున్నారు.

కిలో రూ.110కి కొనుగోలు

అల్లం కిలో రూ.110 చొప్పున దళారీ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్లు గిరిజన రైతులు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో సాధారణ వినియోగదారులు ప్రస్తుతం కిలో రూ.140 పైనే కొనుగోలు చేస్తున్నారు. కిలో రూ.30 మేర వ్యత్యాసం ఉంది. వ్యాపారులు గ్రామాలకు వెళ్లి సిండికేట్‌గా మారి కొనుగోలు చేస్తున్నారు. అలాగే మరికొందరు ముందుగా అడ్వాన్స్‌లు ఇచ్చి కొనుగోలు చేయడంతో తప్పసరి పరిస్థితుల్లో దళారులకు విక్రయించాల్సి వస్తోందని గిరిజనులు తెలిపారు.

ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలి

ప్రభుత్వ పరంగా అల్లంతో పాటు అన్ని పంటలకు మద్దతు ధరలు కల్పించాలి. పైనాపిల్ పంటలో నష్టాలు చవిచూశాం. ఈ పంటలోనైనా గిరిజనులకు మంచి ఆదాయాలు వస్తాయని ఆశిస్తున్నాం. –ఎస్.మంగయ్య, ఎంపీటీసీ

పంట బాగా పండింది

ఈ ఏడాది పంట బాగా పండింది. ఈ నెలలోనే పంట చేతికి వస్తుంది. గతంతో పోలిస్తే పంట దిగుబడి బాగుంది. ప్రస్తుతానికి గ్రామాల్లోనే విక్రయిస్తున్నాం. బయట మార్కెట్‌లో విక్రయించాలంటే వారపు సంతలకు రావాల్సి ఉంటుంది. ఇది కొద్దిగా కష్టమైన పని. –సవర పెంటయ్య, రంగంవలస

ఇసుక దొరకడం లేదురా బాబూ..

- బొబ్బిలి నుంచి విశాఖకు తరలిపోతున్న వైనం
- స్థానిక ప్రజలకు ఇసుక నిల్
- వ్యాపారులకే కేటాయింపు
- స్థానికంగా నిలిచిన నిర్మాణాలు
- ఒక్కో ట్రాక్టర్ ధర రూ.5వేలు

బొబ్బిలి:

ఉచిత ఇసుక పేరుతో కూటమి ప్రభుత్వం చేస్తున్న వ్యాపారంతో స్థానికులకు ఇసుక కరువైంది. ఇళ్లు, భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయి. భవన నిర్మాణ కార్మికులకు పనిలేకుండా పోయింది. పేరుకే ఉచిత ఇసుక అని, ఇంటికి వచ్చే సరికి ట్రాక్టర్ ఇసుక రూ.3వేల నుంచి రూ.5వేలు పలుకుతుండడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు. జిల్లాలో ఉన్న మూడు స్టాక్ పాయింట్లలో డెంకాడ, కొత్తవలసల్లో ఇసుక నిండుకోగా బొబ్బిలి స్టాక్ పాయింట్‌లో మాత్రమే ఇసుక ఉంది. ఈ ఇసుక కోసం మూడు జిల్లాల పరిధిలోని వారంతా పోటాపోటీగా వచ్చి తీసుకుపోతున్నారు. ట్రాక్టర్ల కన్నా విశాఖ, విజయనగరం తదితర ప్రాంతాల నుంచి కూడా వ్యాపారులు వచ్చి ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. ధర ఎక్కువ కావడంతో స్థానికులు కొనుగోలు చేయలేకపోతున్నారు.

స్థానికులకు లభించని ఇసుక..

బొబ్బిలి, కొత్తవలస, డెంకాడ ప్రాంతాల్లోని ఇసుక స్టాక్ యార్డుల నుంచి సుమారు 20 రోజుల కిందట ఇసుక విక్రయాలు ప్రారంభించారు. టన్ను రూ.605లు చొప్పున ధర పెట్టి ఉచిత ఇసుక అంటూ అట్టహాసంగా ప్రారంభించారు. ఇదేక ధరకు ఇసుకను సమీపంలోని పట్టణానికి చేరవేస్తే రూ.3,500లు అవుతోంది. తెర్లాం తదితర ప్రాంతాలకు అయితే రూ.4,500 పలుకుతోంది. ఇప్పుడు జిల్లాలో ఎక్కడా ఇసుక నిల్వలు లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా వచ్చి వ్యాపారులు కొనుగోలుచేస్తున్నారు.



బొబ్బిలిలో ఇసుక యార్డు వద్ద లారీల క్యూ

నిలిచిన నిర్మాణాలు...

కూటమి ప్రభుత్వం ఇసుక విక్రయాలు చేపట్టక ముందు ఇసుక తక్కువ ధరకు వచ్చేది. నిర్మాణాలు సాఫీగా సాగేవి. కూలీలు, మేస్త్రీలకు చేతినిండా పనిదొరికేది. ఇప్పుడు ఇసుక ధర ఎక్కువ కావడంతో నిర్మాణదారులు కొనుగోలు చేయలేకపోతున్నారు. దాదాపు 20 రోజులుగా నిర్మాణాలు నిలిచిపోయాయి. అపార్ట్‌మెంట్లు నిర్మించేవారు కూడా కొనుగోలుచేయలేనంతగా ఇసుక ధరలు ఉన్నాయంటూ పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఉచిత ఇసుక అంటూ భారీ వ్యాపారానికి కూటమి నేతలు తెరతీశారని పేర్కొంటున్నారు.

ఉచిత ఇసుకకు ఇంత ధరా?



రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక ఇస్తామని చెప్పింది. ఇక్కడకు వస్తే రూ.650లు టన్నుకు చెల్లించే సరికి రవాణా చార్జీలతో కలిపి దగ్గరలోనే ఉన్న పట్టణానికి రూ.4వేలు అవుతోంది. ఇదేం ఉచితం? అధికారులు స్పందించాలి. ఉచితంగానే ఇసుక ఇవ్వాలి. - పంట్ల సత్యనారాయణ, మెట్టవలస

ఇళ్ల నిర్మాణాలు ఆపేశా!



మాది బొబ్బిలి. మేస్త్రీని. నా చేతిలో నిర్మాణానికి నాలుగు ఇళ్లు ఉన్నాయి. సుమారు 20 మంది కూలీలు నా వద్ద పని చేస్తున్నారు. ఇసుక ధర ఎక్కువ కావడంతో యజమానులు పని ఆపేశారు. పనుల్లేక తనతోపాటు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. - పి.పోలారావు, బొబ్బిలి

పనుల్లేక అవస్థలు



ఇసుక కొరతతో నిర్మాణ పనులు నిలిచిపోవడం నా అనుభవంలో ఇదే తొలిసారి. గతంలో రూ.1500కు ట్రాక్టర్ ఇసుక బొబ్బిలి వచ్చేది. ఇప్పుడు రూ.3,500 నుంచి రూ.4వేలు పలుకుతోంది. అంత ధర పెట్టి ఎవరూ కొనుగోలు చేయడం లేదు. ఈ వ్యవస్థ మానేసి మునుపటిలా ఇసుక దొరికేలాచర్యలు తీసుకోవాలి. - కొనిరెడ్డి అప్పలనాయుడు, మేస్త్రి, బొబ్బిలి

క్లుప్తంగా

నాణ్యమైన కూరగాయలు సరఫరా చేయండి

● ఐటీడీఏ పీవో రాహుల్‌కుమార్ రెడ్డి



సీల్డ్ టెండర్‌ను ఓపెన్ చేస్తున్న పీవో రాహుల్‌కుమార్ రెడ్డి

సీతంపేట: ఐటీడీఏ పరిధిలో గిరిజన గురుకులాలకు నాణ్యమైన కూరగాయలు సరఫరా చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలు, మినీగురుకులాలు, ఏకలవ్య మోడల్ స్కూల్స్‌కు కూరగాయలు, చికెన్ సరఫరాకు టెండర్లు నిర్వహించారు. అధికారులు, టెండర్‌దారుల సమక్షంలో సీల్డు టెండర్లు ఓపెన్ చేశారు. తక్కువ ధరలకు కోట్ చేసిన వారికి కాంట్రాక్ట్ కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. ఇటు ఐటీడీఏకు అటు మీకు నష్టం కలగకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నాదొర, ఏపీవో గణేష్, డిప్యూటీ ఈవో పి.నారాయుడు, ఏటీడబ్ల్యూవో మంగవేణి, ప్రిన్సిపాల్స్ పి.సూర్యకుమారి, పీవీ రామారావు, తిరుపతిరాజు, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓపై విచారణ

● ఆర్‌జేడీకి యూటీఎఫ్ నాయకుల ఫిర్యాదు



విచారణ చేస్తున్న డిప్యూటీ డీఈఓ కృష్ణమూర్తి తదితరులు

గరుగుబిల్లి: గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల ఎంఈఓ–1 ఎన్.నాగభూషణరావుపై వచ్చిన అవినీతి ఆరోపణల ఫిర్యాదు నేపథ్యంలో పాలకొండ డిప్యూటీ డీఈఓ పి.కృష్ణమూర్తి శుక్రవారం గరుగుబిల్లి ఎంఆర్‌సీలో విచారణ చేపట్టారు. ఎంఈఓ–1 పలు అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ కలెక్టర్, ఆర్‌జేడీకి యూటీఎఫ్ జిల్లాశాఖ ఫిర్యాదులు అందజేసింది. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో ఎంఈఓ–1పై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్ రావులు మాట్లాడుతూ ఎంఈఓ ప్రతి పనికి ఉపాధ్యాయులనుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎస్ఎంఎస్ గ్రాంట్స్, నాడు–నేడు పనుల్లో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్నారు. అక్రమాలపై ఆధారాలతో విచారణాధికారి డిప్యూటీ డీఈఓ కృష్ణమూర్తికి సమర్పించామని, ఎంఈఓపై చర్యలు చేపట్టాలని కోరినట్లు చెప్పారు. అవినీతి ఆరోపణలపై విచారణ చేశామని, తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు డిప్యూటీ డీఈఓ తెలిపారు. విచారణలో పార్వతీపురం ఎంఈఓ–2 కె.ప్రసాద్ ఉన్నారు.

15 తులాల బంగారం చోరీ



దొంగతనం జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న ఎస్సై జయంతి, క్లూస్‌టీం

రామభద్రపురం: మండలకేంద్రంలోని శ్రీరాం నగర్ కాలనీలో గురువారం అర్ధరాత్రి ఓ ఇంట్లో దొంగలు చొరబడి బంగారం,వెండి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన పప్పు ఈశ్వరరావు, సరోజిని దంపతులు తమ కుమారుడు రాంబాబును ఇంటి దగ్గర వదిలేసి ఇటీవల తిరుపతి తీర్థయాత్రకు వెళ్లారు. అయితే ఇదే మండలంలోని బూశాయవలస తమ బంధువుల ఇంటికి రాంబాబు గురువారం సాయంత్రం వెళ్లాడు. ఈ విషయం గమనించిన దొంగలు ఇంటి తలుపులు పగలుకొట్టి లోపలికి చొరబడి బీరువా పగలగొట్టి లోపల ఉన్న 15 తులాల బంగారం వస్తువులు, 450 గ్రాముల వెండి వస్తువులు, రూ.22 వేల నగదు చోరీచేశారు. శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో రాంబాబు ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. అలాగే బీరువా తెరిచి ఉండడంతో పాటు అందులో ఉండాల్సిన బంగారం వెండి వస్తువులు ఉన్న బాక్సు ఇంట్లోని మంచంపై చెల్లాచెదురుగా పడి ఉండడంతో ఆందోళనకు గురై చుట్టుపక్కలవారితో పాటు ఊరిలో ఉన్న బంధువులకు తెలియజేశాడు. దీంతో వారంతా వచ్చి పరిశీలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎస్సై జయంతి, ఏఎస్సై అప్పారావులు సంఘటన స్థలంలో పరిశీలించిన అనంతరం క్లూస్‌టీమ్‌కు సమాచారం ఇచ్చి రప్పించారు. రాంబాబు ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఆర్.అప్పారావు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹180

జనం ఉన్నా.. సౌకర్యాలు సున్నా



ఎర్నాకులం రిజర్వేషన్ బోగీలో కిక్కిరిన ప్రయాణికులు



జనాలతో కిక్కిరిసిన ఎర్నాకులం రైలు

సాక్షి, పార్వతీపురం/పార్వతీపురంటౌన్: రైళ్లలో జనరల్ బోగీలు నరకానికి నకళ్లుగా మారాయి. కిక్కిరిసి న బోగీల్లో ఒకరిపై ఒకరు కూర్చుని, నిల్చుని ప్రయాణించడం సర్వ సాధారణంగా మారింది. వందల కిలోమీటర్ల దూరం నిలబడి ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో మహిళలు, పిల్లలు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతూ కేంద్రప్రభుత్వం తీ రుపై మండిపడుతున్నారు. ఏసీ కోచ్‌లు, వందే భార త్ రైళ్లపై ఉన్న శ్రద్ధ సామాన్యులు ప్రయాణించే జనరల్ బోగీల పైనా పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

పాసింజర్ రైళ్ల తగ్గింపు

ఒకప్పుడు పేదల బండిగా ఉన్న రైలు ఇప్పుడు వారికి అందని ద్రాక్షగా మారుతోంది. కేంద్రప్రభుత్వం ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్‌ఫాస్ట్, వందేభారత్ ప్రవేశపెట్టాక పాసింజర్ రైళ్లను తగ్గించేయడమే కాకుండా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను కాలక్రమేణా కుదిస్తూ వస్తోంది. ప్రయాణికులకు సౌకర్యాలు పెంచుతున్నామంటూనే రైలు ప్రయాణాన్ని పేదలకు దూరం చేస్తోంది. ఈ మేరకు వామపక్ష నాయకులు ధర్నాలు, స్టేషన్‌లలో వినతి పత్రాలు అందిస్తున్నప్పటికీ ఫలితం శూన్యంగా ఉంది.



పార్వతీపురం రైల్వేస్టేషన్‌లో రైలు పునరుద్ధరణపై వినతి పత్రం అందిస్తున్న వామపక్ష నాయకులు (ఫైల్)

ఉత్తరాంధ్ర రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు రైలుకు కలగని మోక్షం

సాధారణ, మధ్యతరగతి ప్రయాణికులు జిల్లా నుంచి విజయవాడకు వెళ్లేందుకు వీలుగా ఉండే రాయగడ–గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు ఉత్తరాంధ్ర రాజధాని ఎక్స్‌ప్రెస్‌గా పేరుగాంచింది. ప్రయాణికులందరికీ అందుబాటులో ఉండే ఈరైలు సర్వీసులను ఆరు నెలలుగా నిలిపివేశారు. జిల్లా నుంచి రాజమండ్రి, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాలకు పనుల కోసం కుటుంబాలతో వలస వెళ్లే ప్రయాణికులకు ఈ రైలు అందరికీ వెసులుబాటుగా ఉండేది. ఈ రైలు ఎప్పుడు ప్రారంభిస్తారా? అని ఈ ప్రాంత వాసులు వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ రైలు రద్దు కావడంతో ఎర్నాకులం, అలెప్పీ–ధన్‌బాద్ వంటి ఇతర రైళ్లపై ఆధార పడుతున్నారు. ఫలితంగా ఆ సర్వీసులన్నీ కిక్కిరిసిపోతున్నాయి.

కేవలం రెండే జనరల్ బోగీలు..

జిల్లా పరిధిలో ప్రధానంగా పార్వతీపురం, గుమడ, కూనేరు, జిమిడిపేట రైల్వేస్టేషన్ల మీదుగా వెళ్లే రైళ్లు అధికంగా ఉన్నాయి. 15 ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రతి రైలులో కేవలం రెండే రెండు జనరల్ బోగీలు ఉంటున్నాయి. ఏళ్ల తరబడి ఇదే దుస్థితి. ప్రయాణికుల రద్దీ కనుగుణంగా రైల్వే శాఖ జనరల్ బోగీలు పెంచడం లేదు. సాధారణ ప్రయాణికులు కనీసం నిలబడేందుకు కూడా ఆ బోగీల్లో స్థలం ఉండడం లేదు. తాగునీటి వసతి సరిగా ఉండదు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉంటున్నాయి.

ఉద్యోగులకు ఇబ్బందులే..

విజయనగరం నుంచి బొబ్బిలి–పార్వతీపురం వరకు నిత్యం వందలాది మంది ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నారు. విజయనగరం నుంచి రావాలంటే వీరికి ఉదయం వేళ కొరాపుట్ డీఎంయూ, రాయపూర్ పాసింజర్ రైళ్లే దిక్కు. సాయంత్రం వేళ విధులు ముగించుకుని వెళ్లే సమయానికి ఒక రైలు కూడా అందుబాటులో లేదు. సాయంత్రం 6గంటల సమయంలో ఎర్నాకులం రైలు ఉన్నప్పటికీ దాని స్లీపర్, జనరల్ బోగీలను దక్కించడంతో మొత్తం ప్రయాణికుల తాకిడంతా ఈ రైలు మీదే పడుతుంది. రిజర్వేషన్ బోగీలు సైతం ప్రయాణికులతో కిక్కిరిసిపోయి టాయిలెట్స్ వద్ద కూర్చుని ప్రయాణం సాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో రాయగడ–గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు సాయంత్రం 4గంటల సమయంలో పార్వతీపురం వచ్చేది. పార్వతీపురం, బొబ్బిలి నుంచి వెళ్లే ఉద్యోగులకు ఇది ఉపయోగకరంగా ఉండేది. కొన్ని నెలలుగా ఆ రైలు సర్వీసులు నిలిపివేయడంతో సాధారణ ప్రయాణికులతో పాటు ఉద్యోగవర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి.

సమస్యలు పరిష్కరించాలి



ప్రతిరోజూ వ్యాపార కేంద్రం విజయనగరం నుంచి పార్వతీపురం ప్రయాణం చేస్తున్నాను. జనరల్ బోగీలో ప్రయాణం నరకంగా ఉంటోంది. అక్కడ విపరీతమైన రద్దీ ఉంటున్నప్పటికీ ఇబ్బందులు పడుతూనే ఎలాగోలా ప్రయాణం చేస్తున్నా. మా అవస్థలు అన్నీ ఇన్నీ కావు. రైలు ప్రయాణమంటేనే భయమేస్తోంది.

శ్రీనివాసరావు, ప్రయాణికుడు

గుంటూరు రాయగడ రైలుకు కలగని మోక్షం

జిల్లాలో ప్రతిరోజూ ప్రయాణించే రైళ్లు 9, స్పెషల్ రైళ్లు 9

జనరల్ బోగీలు పెంచాలి



విశాఖపట్నం నుంచి పార్వతీపురం ప్రయాణించాం. అలెప్పీ ధన్‌బాద్ రైలుకు రిజర్వేషన్ చేయించుకున్నా సీటు కన్ఫర్మ్ కాకపోవడంతో జనరల్ బోగీలో వచ్చాం. విపరీతమైన రద్దీ ఉంది. నిల్చోవడానికి కాళ్లు కింద పెట్టాలన్నా కుదర్లేదు. ఒంటి కాలిపైనే ప్రయాణించాం. జనరల్‌లో రెండు బోగీలే ఉండడంతో అవస్థలు పడ్డాం. బోగీలను పెంచాలి.

– ఉమా మహేశ్వరరావు, ప్రయాణికుడు

కేంద్ర ప్రభుత్వం తీరు అన్యాయం



సామాన్యులకు రైలు ప్రయాణాన్ని దూరం చేసేలా తీసుకుంటున్న నిర్ణయాలను కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. స్లీపర్ కోచ్, ఏసీ కోచ్‌ల ధరలు అందని ద్రాక్షలా మారాయి. ప్లాట్‌ఫాం పొడవు లేదని బోగీలను పెంచకపోవడం సరికాదు. దశాబ్దాల తరబడి రెండు జనరల్ బోగీలనే కొనసాగిస్తుండడం అన్యాయం.

పి.సంఘం, సీపీఐఎంఎల్ లిబరేషన్, జిల్లా కన్వీనర్

చదువు కొనసాగించేందుకు ఓపెన్ స్కూల్



ప్రచార పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

● 27వ తేదీ లోగా రిజిస్టర్ చేసుకోవాలి
● కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఓపెన్ స్కూల్ ద్వారా విద్యాభాసాన్ని కొనసాగించేలా చూడాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోరారు. చదువుకోడానికి సార్వత్రిక విద్య చక్కని అవకాశమని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న వారంతా పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ పరీక్షలను ఓపెన్ స్కూల్ ద్వారా రాసి అర్థాంతరంగా ఆగిపోయిన వారి చదువును కొనసాగించవచ్చని సూచించారు. ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై తన చాంబర్‌లో కలెక్టర్ అంబేద్కర్ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఓపెన్ స్కూల్ గురించి డీఈఓ ఎన్.ప్రేమకుమార్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ ఎటువంటి విద్యార్హతలు లేని వారు చదువును మధ్యలో వదిలేసిన వారు నేరుగా పదోతరగతి పరీక్షలకు హజరయ్యేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఒక చక్కని మార్గమన్నారు. ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాలు నిండేవారంతా పరీక్షలకు హాజరు కావచ్చునని తెలిపారు. పదోతరగతి లేదా ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరు కావాలనుకునే వారు ఈ నెల 27వ తేదీలోగా వారి పేర్లను ఆన్‌లైన్‌లో లేదా ఎంఈఓ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పదోతరగతి పరీక్షలకు హాజరుకావాలనుకునే వారు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100, ఇంటర్ పరీక్షలకు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పదోతరగతికి హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, మహిళలు రూ.900 ఫీజు, ఇతరులు రూ.1,300 చెల్లించాలని తెలిపారు. అలాగే ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, మహిళలు రూ.1,100, ఇతరులు రూ.1,400 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెల 27వ తరువాత నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు రూ.200 అపరాధ రుసుంతో ఫీజులు చెల్లించవచ్చని స్పష్టం చేశారు. అనంతరం ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ అంబేద్కర్ విడుదల చేశారు. సమావేశంలో డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్, జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవ ,మెప్మా పీడీ సుధాకరరావు, డ్వామా పీడీ జి.ఉమాపరవేశ్వరి, ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ, డీవీఈఓ ఎస్.భీమశంకర్, డీసీఎల్ సుబ్రహ్మణ్యం, డైట్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుపతినాయుడు, అసిస్టెంట్ కంట్రోలర్ టి.సన్యాసి రాజు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ బాధితులకు ఆర్థిక భరోసా

● ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు

పార్వతీపురం: హిట్ అండ్ రన్ (గుర్తు తెలియని వాహనాలు ఢీ కొన్న) కేసుల్లో బాధితులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రెవెన్యూ, పోలీసు అధికారులు, బాధితులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హిట్ అండ్ రన్ కేసుల్లో మరణించిన వారి కుటుంబసభ్యులకు రూ.2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50వేలు పరిహారం అందించనున్నట్లు తెలిపారు. గుర్తు తెలియని వాహనాలు ఢీ కొన్న సంఘటనలో బాధితులు పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్లెయిమ్ చేసుకునే విధానంపై ఈ సందర్భంగా తెలియజేశారు. తరువాత వాహనం గుర్తిస్తే ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి కూడా పరిహారం పొందవచ్చన్నారు. చాలామంది బాధితులు ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసేందుకు వీలుపడదనే ఉద్దేశంతో హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు కేంద్రప్రభుత్వం అందించే పరిహారం క్లెయిమ్ చేసుకునేందుకు ముందుకురావడం లేదని, ఇన్సూరెన్స్ క్లెయిమ్‌కు, ప్రస్తుతం అందిస్తున్న పరిహారానికి సంబంధం లేదని కావున హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులందరూ ఈ పరిహారం పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు కె.హేమలత, వీవీ.రమణ, చినమేరంగి సీఐ బి.మంగరాజు, పార్వతీపురం టౌన్ ఎస్సైలు కె.ప్రయోగ మూర్తి, బి.సంతోషి తదితరులు పాల్గొన్నారు. హిట్ అండ్ రన్ కేసులో చనిపోయిన కొమరాడ మండలం కోటిపాం గ్రామానికి చెందిన వేసముల ప్రశాంతి కుటుంబసభ్యులు, పార్వతీపురం పట్టణంలోని వైకేఎం కాలనీకి చెందిన చందక సూర్యప్రకాశ్ భార్య రాజేశ్వరి పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న డీఆర్‌ఓ కేశవనాయుడు

గ్రామసచివాలయంలో చోరీ



గ్రామ సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

రేగిడి: మండల పరిధిలోని తోకలవలస గ్రామ సచివాలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. దీనిపై ఎస్సై ఇ.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ సచివాలయం తలుపుల తాళాలు పగలగొట్టి లోపలకు ప్రవేశించి బీరువాలను తెరిచి అందులో ఉన్న సెల్‌ఫోన్‌లు దొంగిలించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి రాకేష్‌కుమార్ శుక్రవారం ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

అక్రమ రవాణా నియంత్రణకు వాహనాల తనిఖీ

● ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు

విజయనగరం క్రైమ్: జిల్లాలో గంజాయి, మద్యం, సారా, పశువుల అక్రమ రవాణాను నియంత్రించడంలో భాగంగా ఆగస్టు ఒకటో తేదీ నుంచి వారం రోజుల పాటు కొన్ని గుర్తించిన ప్రాంతాల్లో డైనమిక్ వాహన తనిఖీలు చేపట్టాలని పోలీస్ అధికారులకు ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు సమయాల్లో వాహన తనిఖీలు చేపట్టాలని చెప్పారు. ఈ తనిఖీల్లో ఎస్సై స్థాయి అధికారి తప్పనిసరిగా ఉండాలని, వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, తనిఖీ చేసిన వాహనాల వివరాలను నమోదుచేయాలని స్పష్టం చేశారు. అలవాటుగా వాహన తనిఖీలు చేపట్టే ప్రాంతాలకు, సమయాలకు స్వస్తి పలకాలని చెప్పారు. ముఖ్యంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలపై దృష్టి పెట్టాలని, ఆయా వాహనాలను అధికారులు, సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. డైనమిక్ వాహన తనిఖీలకు సంబంధించి ప్రణాళిక రూపొందించి, షెడ్యూల్ విడుదల చేశారు. వాహన తనిఖీలను సంబంధిత డీఎస్పీలు, సీఐలు పర్యవేక్షించాలంటూ ఆదేశాలు జారీచేశారు.



వాహన తనిఖీలు చేపడుతున్న పోలీస్ అధికారులు

పాముకాటుతో యువకుడి మృతి



సుధీర్ మృతదేహం

బొబ్బిలిరూరల్: మండలంలోని చింతాడ గ్రామంలో పాముకాటుకు గురై ఓ యువకుడు మృతిచెందాడు. శుక్రవారం ఉదయం ఇంటి వెనుక ఉన్న కళ్లానికి వెళ్లిన గ్రామానికి చెందిన తోడబండి సుధీర్(27)ను పాము కాటు వేసింది. ఏదో పురుగు కరిచి ఉంటుందని భావించి రక్తమోడుతున్న కాలిగాయాన్ని అక్కడున్న చెరువులో కడుక్కుని గట్టుపైన ఉన్న స్నేహితులతో పిచ్చాపాటి మాట్లాడుతుండగా కాస్త కాలువాపు, నొప్పి అనిపించడంతో స్నేహితులకు చెప్పి బొబ్బిలి ఆస్పత్రికి వెళ్దామని బయలుదేరాడు. అయితే అప్పటికే విషం శరీరమంతా వ్యాపించడంతో పరిస్థితి విషమించి మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచాడు.దీంతో విషయం తెలుసుకున్న మృతుడి తండ్రి పోలినాయుడు, తల్లి సత్యవతి, సోదరి భోరున విలపించారు. చేతికి అందివచ్చిన ఒక్కగానొక్క కొడుకు చిన్నవయసులోనే దూరం కావడంతో గుండెలవిసేలా విలపించారు. ఇంజినీరింగ్ చదువుకున్న సుధీర్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేసేవాడని, కరోనా సమయంలో స్వగ్రామం వచ్చి ఇక్కడే తల్లిదండ్రులతో వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉంటున్నాడని గ్రామస్తులు చెబుతూ కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బేబీనాయన యువకుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నీటి గుంతలో పడి కలాసీ..

రేగిడి: మండలంలోని ఆమదాలవలస కాలనీకి చెందిన కలాసీ కుమిలి రాంబాబు(35) నీటి గుంతలో పడి శుక్రవారం మృతిచెందాడు. దీనిపై ఎస్సై ఇ.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంబాబు రేగిడి పౌరసరఫరాల గోదాంలో కలాసీగా విధులు నిర్వహిస్తున్నాడు. తన ఇంటి వద్ద భోజనం అనంతరం చిన్నశిర్లాంలో గల అత్త వారింటికి వెళ్లి భార్యాపిల్లలను కలిసిన తరువాత తిరుగుప్రయాణమయ్యాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రాంబాబు చిన్నశిర్లాం ప్రధాన రహదారి జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న నీటి గుంతలో పడిపోయాడు. ఈ విషయం గమనించిన స్థానికులు గమనించి బయటకు తీసేలోగానే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి ఆరాతీశారు. మృతుడికి భార్య సంతోషి, కుమార్తె పూజిత ఉన్నారు. భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



రేగిడి : కలాసీ రాంబాబు మృతదేహం

బైక్ ఢీకొని వృద్ధుడు..

లక్కవరపుకోట: అరకు–విశాఖ రోడ్డులో లక్కవరపు కోట మండలంలోని సంతపేట జంక్షన్ సమీపంలో శుక్రవారం ఉదయం నడుచుకుంటూ వెళ్తున్న జి.లక్ష్మణ (69) అనే వృద్ధుడిని అదుపుతప్పిన ద్విచక్రవాహనం వెనుకనుంచి ఢీకొనడంతో మృతి చెందాడు. దీనిపై ఎస్సై గోపాలరావు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు లక్ష్మణది అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం ముషిడిపల్లి గ్రామం. తన బంధువులు లక్కవరపుకోట మండలంలోని రంగారాయపురం గ్రామంలో ఉండడంతో అక్కడికి వచ్చి తిరిగి వెళ్తుండగా బైక్ ఢీకొట్టడంతో గాయాలపాలైన లక్ష్మణను విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

తైక్వాండో పోటీలకు జిల్లా జట్టు పయనం

విజయనగరం: రాష్ట్రస్థాయిలో అనంతపురంజిల్లాలోని తాడిపత్రిలో జరగనున్న తైక్వాండో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు శుక్రవారం పయనమైంది. ఈ నెల 3, 4 తేదీల్లో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, క్యాడెట్ తైక్వాండో పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి 38 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. వారికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావులు పలు సూచనలు, సలహాలు చేశారు. రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభాపాటవాలు కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు కోచ్ అండ్ మేనేజర్‌లుగా ఎం.గగన్ సాగర్, కె.చైతన్యలు, రిఫరీగా కె.దీపిక వ్యవహరించనున్నారు.



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు

లాడ్జిలో పట్టుబడిన 4 కిలోల బంగారం

● రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: వివిధ పన్నులు, జీఎస్టీ చెల్లించకుండా పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలను తరలిస్తున్న ముఠాను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ మేరకు డీఎస్పీ పి.శ్రీనివాసరావు శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించిన సమాచారం ప్రకారం బొబ్బిలి పట్టణంలోని శ్రీ సూర్య లాడ్జిలోని 4వ నంబర్ రూమ్‌లో రాజస్థాన్‌కు చెందిన భవేష్ కుమావత్ , భారియా ఆనంద్ కుమార్‌లు బంగారంతో దిగినట్లు సీఐ ఎం.నాగేశ్వర రావుకు సమాచారం అందింది. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి సిబ్బందితో కలిసి సీఐ దాడి చేశారు. ఈ దాడిలో సుమారు నాలుగు కిలోల బంగారాన్ని వారి వద్ద ఉన్న రెండు ప్లాస్టిక్‌బాక్స్, కాటన్ సంచులతో ఉన్న బంగారాన్ని గుర్తించారు. అయితే వారి వద్ద వాటికి అవసరమైన బిల్లులు కానీ, ఏ విధమైన డాక్యుమెంట్లు కానీ లేవు. గుంటూరులోని పట్నం బజారులో ఉన్న శాంతి గోల్డ్ జ్యుయలరీ నుంచి ఆభరణాలు తీసుకువచ్చినట్లు పోలీసులకు వారు సమాధానం చెప్పారు. వారు చెప్పిన సమాధానం కరెక్ట్‌గా లేకపోవడంతో పోలీసులు బంగారాన్ని స్వాధీనం చేసుకుని, వారిద్దరినీ అరెస్టు చేశారు.



స్వాధీనం చేసుకున్న బంగారం

బిల్లులు లేకుండా విక్రయం

పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తులో 18 ఆకారాల్లో మొత్తం 535 ఆభరణాలు ఉన్నాయి. బిల్లులు లేకుండా పట్టణంలోని పలు బంగారు దుకాణాలకు వీరు తరచూ బంగారాన్ని విక్రయిస్తున్నట్లు తెలిసింది. బంగారాన్ని బిల్లులు లేకుండా విక్రయించడం వల్ల వర్తకులకు తక్కువ ధరకు లభిస్తోంది. ఇదే బంగారాన్ని అధిక ధరలకు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ పి శ్రీనివాసరావు, సీఐ ఎం.నాగేశ్వర రావు తెలిపారు.